క్లుప్తంగా

ఉపాధి పనుల్లో అవకతవకలు



నివేదికను చదివి వినిపిస్తున్న సామాజిక బృంద సభ్యుడు

పూసపాటిరేగ: మండలంలోని వెల్దూరు గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులలో అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. వెల్దూరు సచివాలయంలో సర్పంచ్ నాయిన సత్యవతి అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల్లో చోటుచేసుకున్న లోటుపాట్లు, కొలతల్లో తేడాలు, మస్తర్లలో తేడాలను బృంద సభ్యులు చదివి వినిపించారు. సమావేశంలో కార్యదర్శి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



అభాగ్యులకు దుప్పట్లు కప్పుతున్న విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఒంటరిగా ఉంటున్న నిరాశ్రయులు, అభాగ్యులకు విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. రెండు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో వంద మంది నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామాష్ తెలిపారు. కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత



గణేష్‌కు బ్యాటరీ ట్రై సైకిల్ అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: చీపురుపల్లి మండలం ఇటకర్లపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు అంబళ్ల గణేష్‌కు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం తన కార్యాలయం ఆవరణలో బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు కేవీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



గంటస్తంభం వద్ద ర్యాలీగా వస్తున్న బీజేపీ నాయకులు

విజయనగరం టౌన్: పెంచిన విద్యుత్ యూజర్ చార్జీలను, ట్రూ అప్ చార్జీలను వెంటనే తగ్గించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎన్.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ కార్యకర్తలు, నాయకుల ఆధ్వర్యంలో కోట జంక్షన్ నుంచి మూడులాంతర్లు, గంటస్తంభం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రెడ్డి పావని, కుసుమంచి సుబ్బారావు, బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వితరణ



ఈఓ సుధారాణికి విరాళం అందజేస్తున్న సత్యభామ

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఘంటసాల సత్యభామ తన భర్త శివరామకృష్ణ ప్రసాద్ జ్ఞాపకార్థం రూ. 50 వేల విరాళం ఈఓ సుధారాణికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి దాతలు అందజేస్తున్న సహకారం ఎనలేనిదన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు



జీవామృతం కషాయం తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తే ఆరోగ్యంతో పాటు లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్ అన్నారు. జొన్నవలసలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయాధికారులు, రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవామృతం కషాయం తయారీపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో డీపీఎం కార్యాలయాధికారి ప్రసాద్, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం స్వామి, సీసీ నాయుడు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నమో నారాయణాయ...



డెంకాడ: చింతలవలస బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ఉత్తర ద్వారం గుండా ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

శ్రీ మహా విష్ణువు గరుడ వాహనరూఢుడై మూడు కోట్ల మంది దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిచ్చిన పర్వదినం ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి. ఈ రోజున ఆలయాల్లో వైకుంఠ ద్వారాలు (ఉత్తర ద్వారాలు) తెరుచుకుంటాయి. ఈ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు శనివారం వేకువజాము నుంచే ఆలయాల్లో బారులుతీరారు. వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకుంటే ముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివెరిసింది.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం టౌన్: అరుంధతీనగర్‌లో ప్రత్యేక అలంకరణలో ఉన్న వైభవ వెంకటేశ్వరస్వామి



విజయనగరం రూరల్: రామనారాయణంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో అర్చకులు



నెల్లిమర్ల రూరల్: మొయిద వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేత సూర్యనారాయణ రాజు



విజయనగరం టౌన్: ఉత్తర ద్వారం గుండా దర్శనమిస్తున్న కల్యాణ వేంకటేశ్వరుడు

ప్రజలు మెచ్చే పాలనే జగనన్న లక్ష్యం



రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి
- 30వ డివిజన్‌లో రూ.17 లక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విజయనగరం: నగరంలోని అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు పని చేస్తున్నారని విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 30వ డివిజన్ కొత్త ధర్మపురిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న రహదారి పనులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శనివారం శంకుస్థాపన చేశారు. ఆమెకు డివిజన్ నాయకులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కొత్త ధర్మపురి ప్రజలు ఎన్నో ఏళ్లుగా రహదారి లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తెలుసుకున్నామన్నారు. దీంతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి రూ. 17 లక్షలు మంజూరు చేయడంతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు మాట్లాడుతూ, తమ డివిజన్ అభివృద్ధిపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోర్ట్‌సిటీ స్కూల్‌లో లెర్నింగ్ ఫెస్ట్

విజయనగరం ఫూల్‌బాగ్: ఫోర్ట్ సిటీ స్కూల్‌లో రామానుజన్ జయంతి సందర్భంగా లెర్నింగ్ ఫెస్ట్–2023 శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సుమారు 1000 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ కేవీపీ రాజు మాట్లాడుతూ, ఇటువంటి విద్యా,వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ జియాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ, తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులు వీరే..



కోరుకొండ హరీష్



అంబళ్ల కిరణ్



కరుమజ్జి త్రినాథరావు



పడాల శ్రీధర్



సుందర హరీష్

పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ యువజన విభాగం మండల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేసినట్లు తెలిపారు. నెల్లిమర్ల నగర పంచాయతీ యువజన విభాగం అధ్యక్షుడిగా కోరుకొండ హరీష్, నెల్లిమర్ల మండల యువజన విభాగం అధ్యక్షుడిగా అంబళ్ల కిరణ్‌కుమార్, డెంకాడ మండల అధ్యక్షుడిగా కరుమజ్జి త్రినాథరావు, పూసపాటిరేగ మండల అధ్యక్షుడిగా పడాల శ్రీధదర్, భోగాపురం మండల యువజన విభాగం అధ్యక్షుడిగా సుందర హరీష్ నియమితులయ్యారు.

హామీలు అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నగర పంచాయతీ కార్మికులు

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికులకు సీఎం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యూఎస్ రవికుమార్, నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 26 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కార్యాలయం నుంచి మొయిద జంక్షన్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీఐటీయూ యూనియన్ జిల్లా బాధ్యుడు ఎ. జగన్ మోహనరావు ప్రారంభించారు. బైక్ ర్యాలీలో యూనియన్ నాయకులు బాబూరావు, శ్రీను, హరిబాబు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలకు వేదికలు ఖరారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న 'ఆడుదాం... ఆంధ్ర' క్రీడా పోటీల వేదికలు ఖరారయ్యాయని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనల మేరకు ఈ నెల 26న సారిక గ్రామంలోని అగ్రిల్యాబ్ వద్ద ప్రారంభ పోటీలు ప్రారంభిస్తామన్నారు. మండలంలోని 13 గ్రామ సచివాలయ పరిధిలో 13 వేదికలను ఖరారు చేయడం జరిగిందని, ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 31తో పోటీలు పూర్తవుతాయన్నారు. క్రీడా పోటీల విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మస్తాన్‌వలీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యారంగానికి పెద్దపీట



భోగాపురం: విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: పేదరికాన్ని శాశ్వతంగా తరిమికొట్టే సత్తా విద్యకు మాత్రమే ఉందని.. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మరో మైలురాయి చేరేలా సీఎం జగనన్న డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టారన్నారు. టీడీపీ హయాంలో విద్యను వ్యాపారంగా మార్చి కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాశారని ఆరోపించారు. అలాంటి వ్యవస్థను రూపుమాపిన ఘనత జగనన్నకు దక్కిందని కొనియాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, నాడు - నేడు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ లాంటి పథకాలను అమలుచేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం అందజేసిన ఒక్కో ట్యాబ్ ఖరీదు రూ.16.500 కాగా, బైజూస్ కంటెంట్ చేర్చేందుకు మరో 15.500 రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, పడాల భానుప్రకాశ్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, మండల ప్రత్యేకాధికారి సుధారాణి, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఎంఈఓ చంద్రమౌళి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: మోపాడ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, తదితరులు

ప్రభుత్వ విద్య బలోపేతం..

డెంకాడ: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో పని చేస్తోందని ఎంపీపీ బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు అన్నారు. మండలంలోని మోపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు కస్తూరిబాగాంధీ విద్యాలయం విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను మాజీ సర్పంచ్ బడ్డుకొండ రమేష్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్పొరేట్‌కు మిన్నగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్న ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బంటుపల్లి సత్యంనాయుడు, ఎంఈఓ వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే బడ్డుకొండ



భోగాపురం: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి అధికారులు నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా ర్యాలీని ఎమ్మెల్యే బడ్డుకొండ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 10 వరకూ క్రీడా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. మండలంలో ఉన్న యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, పడాల భానుప్రకాశ్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, మండల ప్రత్యేకాధికారి సుధారాణి, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఎంఈఓ బి చంద్రమౌళి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీలు చిన్నారి, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

పూసపాటిరేగ: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మహంతి కల్యాణి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. సచివాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ బూడివీధి, సాలిపేట, జాతీయరహదారి, పూసపాటిరేగ జెడ్పీ హైస్కూల్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 26వ తేదీ నుంచి సచివాలయం స్థాయిలో జరగబోయే క్రీడాపోటీలలో గ్రామీణ యువత పాల్గొనాలని కోరారు. అనంతరం మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, ఎంపీడీఓ ఎ. రాధిక, భోగాపురం ఐసీడీఎస్ పీఓ ఎస్తేరురాణి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచ్ టి. సీతారాం, హెచ్‌ఎం బి. శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే..

డెంకాడ: క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణ వద్ద ప్రారంభమైన ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ గనివాడ శంకరజగన్నాథ్, వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజయనగరం: సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్



నెల్లిమర్ల: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దాం..

విజయనగరం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి. ఈశ్వర్ కౌశిక్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గం పరిధిలో క్రీడా పోటీల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. వార్డు అడ్మిన్ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. యువత ఆరోగ్యం, శారీరక దారుఢ్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 26 నుంచి క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ వంటి ఐదు క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. సచివాలయ స్థాయి విజేతలు మండల, నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు. పోటీల నిర్వహణపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంలో భాగంగా ఆదివారం నగరంలోని కోట జంక్షన్ నుంచి రాజీవ్‌క్రీడామైదానం వరకు 2కె రన్ నిర్వహిస్తామని, ఈ రన్‌లో క్రీడాకారులు, క్రీడాభిమానులు, క్రీడా ప్రోత్సాహకులు పాల్గొనాలని కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి...

నెల్లిమర్ల: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.రామారావు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ పిలుపునిచ్చారు. నగర పంచాయితీలో నిర్వహించిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడతోందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.సింహాద్రి, నగర పంచాయతీ మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, ఎంఈఓ -1 యు. సూర్యనారాయణమూర్తి, ఎంఈఓ– 2 ఈ.విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: ఆడుదాం ఆంధ్రా ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ కల్యాణి, విద్యార్థులు, తదితరులు



డెంకాడ: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు



విజయనగరం రూరల్: జొన్నవలసలో నిర్వహిస్తున్న ర్యాలీ

అవగాహన ర్యాలీలు

విజయనగరం రూరల్: ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం.. ఆంధ్రా' కార్యక్రమంపై మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు అవగాహన ర్యాలీల్లో పాల్గొని ఆడుదాం... ఆంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. మండలంలోని జొన్నవలసలో నిర్వహించిన ర్యాలీలో సర్పంచ్ కంది రమాదేవి, హెచ్‌ఎం విజయలక్ష్మి, పీఈటీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే దుప్పాడలో సర్పంచ్ కరుమజ్జి లక్ష్మి, వైస్ సర్పంచ్ బద్రి బుజ్జి, పంచాయతీ కార్యదర్శి టి.వెంకటరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కె.రాములప్పుడు, తదితరులు పాల్గొన్నారు.

నియామకాలు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ సంస్థాగత నియామకాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగంలో నూతన నియామకాలు చేపట్టింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయనగరం నియోజకవర్గంలో ఇద్దరు నాయకులకు నూతనంగా బాధ్యతలు అప్పగించింది. విజయనగరం పట్టణ యువజన విభాగం అధ్యక్షుడిగా అల్లు చాణక్య, మండల యువజన విభాగం అధ్యక్షుడిగా కోరాడ రవికుమార్ నియమితులయ్యారు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి

భోగాపురం: రైతులు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో వారికి పంటలపై తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేస్తున్నామని జిల్లా స్టేట్ బ్యాంక్ క్రెడిట్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. రైతుల దినోత్సవం సందర్భంగా మండలంలోని చాకివలసలో శుక్రవారం రాత్రి స్టేట్‌బ్యాంక్ అధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 15 మంది రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఏసీబీ భోగాపురం ఎస్‌బీఐ మేనేజర్ ఎన్ వెంకటలక్ష్మి, హైవే రోడ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ డి. విద్యాసాగర్, డిప్యూటీ మేనేజర్ కె. భవానీ, ఫీల్డ్ ఆఫీసర్ జి సత్యనారాయణ, ముద్దన సంజీవరావు, గ్రామ పెద్దలు లంక రాము, రామనర్శి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.